నాడు కుగ్రామం.. నేడు ఆదర్శం



శంకరబండ గ్రామంలో నిర్మించిన సచివాలయం

- ప్రగతి బాటలో శంకరబండ గ్రామం
- సచివాలయ వ్యవస్థతో మారిన రూపురేఖలు
- గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు
- రూ. 24 కోట్లతో అభివృద్ధి పనులు
- మండలంలో మోడల్‌గా నిలిచిన గ్రామం

ఆస్పరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సచివాలయ వ్యవస్థతో మండలంలో ని శంకరబండ గ్రామ రూపురేఖలు మారిపోయా యి. ఒకప్పుడు గ్రామం నుంచి ఏ చిన్నపనికైనా 3 కి.మీ దూరంలో ఉన్న మండల కేంద్రం ఆస్పరికి వెళ్లాల్సిం దే. శంకరబండ సచివాలయం పరిధిలో చిరుమాన్‌దొడ్డి, చొక్కనహళ్లి గ్రామాలు ఉన్నాయి. ఈ మూడు గ్రామాల్లో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనుల కింద నాలుగున్నరేళ్లలో రూ.24 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. ఏన్నో ఏళ్ల నుంచి సమస్యలతో సతమతవుతున్న గ్రామస్తులకు అభివృద్ధి పనుల ద్వారా పరిష్కారం లభించడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ విజయలక్ష్మి సారథ్యంలో అభివృద్ధి పనులు పూర్తిచేయడంతో మండలంలోనే శంకరబండ గ్రామం మోడల్‌గా నిలిచింది.


వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం


సచివాలయ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ


రైతు భరోసా కేంద్రం

గ్రామంలో రికార్డు స్థాయిలో సంక్షేమ పథకాలు

- జగనన్న అమ్మ ఒడి ద్వారా 413 మందికి రూ.1,99,82,337 అందాయి.
- విద్యా దీవెన కింద 147 మందికి రూ.36,23,037
- వసతి దీవెన కింద 114 మందికి రూ.18,05,686
- రైతు భరోసా కింద 772 మందికి రూ.4,74,31,050
- ఉచిత పంటల బీమా కింద 845 మందికి రూ.1,48,94,044
- సున్నా వడ్డీ పంట రుణాలు (రైతులు) కింద 265 మందికి రూ.1,90,765
- ఇన్‌పుట్ సబ్సిడీ ఇద్దరికి రూ.32,250
- పెన్షన్ కానుక కింద ఇప్పటివరకు 502 మందికి రూ.4,89,27000
- వైఎస్సార్ చేయూత కింద 245 మందికి రూ.1.11 కోట్లు
- వైఎస్సార్ ఆసరా ద్వారా 111 పొదుపు గ్రూపు సభ్యులకు రూ.21,87,213
- సున్నా వడ్డీ కింద 355 మందికి రూ.7 లక్షలు
- ఈబీసీ నేస్తం కింద 8 మందికి రూ.2.25లక్షలు
- ఆరోగ్య శ్రీ కింద 149 మందికి రూ.51,14,36
- ఆరోగ్య ఆసరా కింద 96 మందికి రూ.6,45,950
- హౌసింగ్ (లబ్ధిదారులకు నేరుగా చెల్లింపులు) 48 మందికి రూ.64,22,545
- వైఎస్సార్ బీమా కింద 11 మందికి రూ.21.55
- వాహన మిత్ర కింద 15 మందికి రూ.3.20 లక్షలు.
- జగన్న చేదోడు (రజకులు, టైలర్లు, నాయీ బ్రాహ్మణులు) కింద 30 మందికి రూ.5.70 లక్షలు
- వైట్ కార్డు హోల్డర్లకు ప్రత్యేక కోవిడ్ సహాయం కింద 927 మందికి రూ.27 లక్షలు
- జగనన్న తోడు (వడ్డీ) కింద 36 మందికి రూ.20,425
- విద్యాకానుక కింద 393 మందికి రూ.27,91,086
- జగనన్న తోడు (రుణాలు) 48 మందికి రూ.8,93,712
- గోరుముద్ద కింద 420 మంది విద్యార్థులకు రూ.41,60,940
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద 372 మందికి రూ.69,67,560
- ఇంటింటికి రేషన్ కింద 1032 మందికి రూ.22,54,300
- ఇవన్నీ గాక పరోక్ష ప్రయోజనాల ద్వారా రూ.6,23,58,184 గ్రామస్తులకు అందాయి.



అభివృద్ధికి పెద్ద పీట

- రూ.43.60 లక్షలతో గ్రామ సచివాలయ భవన నిర్మాణం
- రూ.23.94 లక్షలతో ఆర్బీకే నిర్మాణం
- రూ.20.80 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణం
- సచివాలయం నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం
- రూ.20 లక్షలతో ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు, పైపులైన్ల ఏర్పాటు
- రూ.14 లక్షలతో నాడు-నేడు కింద ప్రాథమిక పాఠశాల మరమ్మతులు
- రూ.53 లక్షలతో మాధవస్వామి ఆలయ పునరుద్ధరణ
- ఆదోని రోడ్డు నుంచి కి.మీ దూరంలో ఉన్న శంకరబండ గ్రామం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.76 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనులు త్వరలో ప్రారంభం కానుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని సౌకర్యాలు కల్పించారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో మా గ్రామంలో అన్ని సౌకర్యాలు కల్పించారు. గతంలో ఏ చిన్న పనికైనా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు మా గ్రామంలోనే రైతులకు సబ్సిడీ విత్తనాలు, విద్యార్థులకు సర్టిఫికెట్లు, ప్రజలకు వైద్యం తదితర సౌకర్యాలు కల్పించారు. ఏ ఇబ్బందులు పడకుండా అభివృద్ధి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. – **శివన్న, శంకరబండ గ్రామం**

ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇస్తున్నారు



ప్రతి నెలా ఒకటో తేదీన జీతం మాదిరిగా వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందిస్తున్నారు. సీఎం జగనన్న ప్రజలకు మేలు చేయాలనే తలంపుతో నిరంతరం శ్రమిస్తున్నారు. ఏదైనా సమస్య ఉంటే వలంటీర్లకు చెబితే పరిష్కారమవుతోంది. జగనన్న మేలు మరువలేం.
– **లక్ష్మి, శంకరబండ గ్రామం**

ఎంతో అభివృద్ధి జరిగింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో మా గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. గ్రామ సచివాలయం పరిధిలో ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.24 కోట్లు ఖర్చు చేసింది. నా భర్త పురుషోత్తమ రెడ్డి సహకారంతో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. అభివృద్ధిలో మా గ్రామ పంచాయతీ ముందుంది. ఇందుకు సౌకర్యాలు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు. – **విజయలక్ష్మి, సర్పంచ్, శంకరబండ గ్రామం**

క్లుప్తంగా

ప్రారంభోత్సవానికి సిద్ధం

చిప్పగిరి: మండలం కేంద్రంలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనం నిర్మాణ పనులు పూర్తి చేసుకొని ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. గతంలో అద్దె భవనంలో ఒకే గదిలో గ్రాంథాలయ సేవలు అందేవి. దీంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఇప్పుడు సకల సౌకర్యాలతో ప్రభుత్వం నూతన భవన నిర్మాణం పూర్తి చేసిందని గ్రంథాలయ అధికారి అబ్దుల్ రసూల్ తెలిపారు. నూతన భవనం అందుబాటులోకి వసుతండడంతో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలి

మద్దికెర: స్థానిక రైల్వేస్టేషన్‌లో గతంలో నిలుపుదల ఉన్న ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలిపేలా చర్యలు తీసుకోవాలని కేపీఆర్ మైత్రి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రామ్మోహన్, ఆపద్బంధు సేవా సమితి అధ్యక్షుడు చొక్కా సునీల్ కుమార్ గుంతకల్లు డీఆర్ఎం వినీత్‌సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మద్దికెరలో గతంలో విజయవాడ- హుబ్లీ, హౌరా- వాస్కోడిగామా, కాచిగూడ- బెంగళూరు రైళ్ల నిలుపుదల ఉండేదన్నారు. కరోనా సమయంలో స్టాపింగ్ తీసివేశారని, తగిన చర్యలు తీసుకొని స్టాపింగ్ పునరుద్ధరించాలని కోరారు. అనంతరం డీఆర్ఎంకు శాలువాతో సన్మానం చేసి మొక్కలను అందజేశారు. డీఆర్ఎం సానుకూలంగా స్పందించి ఈ విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి రైళ్ల నిలుపుదలకు కృషి చేస్తానని చెప్పారన్నారు.

వెల్దుర్తి ఆస్పత్రిలో మొదటి సిజేరియన్ కాన్పు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి సామాజిక ప్రభుత్వ ఆసుపత్రి చరిత్రలో మొట్టమొదటిసారిగా సిజేరియన్ కాన్పు బుధవారం జరిగింది. కృష్ణగిరి మండలం రామకృష్ణాపురానికి చెందిన హరిత (23) రెండో కాన్పులో సిజేరియన్ ద్వారా పండంటి ఆడపిల్లకు (3.5 కేజీల బరువు) జన్మనిచ్చింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బాలచంద్రారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. హరితకు మొదటి కాన్పు కర్నూలు ఆసుపత్రిలో సిజేరియన్ ద్వారానే జరిగింది. రెండవ కాన్పు కోసం కుటుంబసభ్యులు వెల్దుర్తి సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. గర్భాశయంలో బిడ్డ ఎదురు కాళ్లతో ఉన్నట్లు గుర్తించిన గైనకాలజిస్టు సాహిత్య జయరాం ఉదయం 11 గంటల సమయంలో స్పెషలిస్టు వైద్యుల సహకారంతో సిజేరియన్ చేసి పండంటి ఆడపిల్లను డెలివరీ చేసింది. తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రభుత్వం రూ.ఆరున్నర కోట్లతో వెల్దుర్తి ఆసుపత్రిని ఆధునికీకరించి అన్ని సౌకర్యాలు కల్పించడంతో ఇక్కడే సిజేరియన్ కాన్పు సాధ్యమైనట్లు చెప్పారు.

సచివాలయాల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు


పార్లపల్లి సచివాలయంలో రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తున్న తహసీల్దార్ కె.ఆంజనేయులు

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాలకు సంబంధించి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభించినట్లు తహసీల్దార్ కె.ఆంజనేయులు తెలిపారు. బుధవారం పార్లపల్లెలో 5, గుడేకల్‌లో 5 రిజిస్ట్రేషన్లు పూర్తిచేసి లబ్ధిదారురాలకు పత్రాలను అందచేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. మండల పరిధిలోని పార్లపల్లి, కె.తిమ్మాపురం, గుడేకల్, మల్కాపురం గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్లు నిరంతరంగా కొనసాగుతాయని తెలిపారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

దేవనకొండ: మండలంలోని మాచాపురం గ్రామ పరిసర ప్రాంతాల్లో బుధవారం నాటుసారా స్థావరాలపై దాడులు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో నాటుసారా స్థావరంపై దాడులు చేసి 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. నాటుసారా తయారీదారులు తమ రాకను గమనించి పరారైనట్లు చెప్పారు. వారిని త్వరలోనే పట్టుకుంటామన్నారు. నాటుసారా తయారీ, అమ్మకాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేస్తామన్నారు. దాడుల్లో కానిస్టేబుళ్లు భాస్కర్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా కులగణన సర్వే

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ నిత్యానందరాజు ఆదేశించారు. బుధవారం మండలంలోని గురజాల, నాగలదిన్నె, పెద్దకొత్తిలి తదితర గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కులగణన సర్వే చేపట్టారు. సర్వేను తహసీల్దార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. .మండలంలో 88.78 శాతం సర్వే పూర్తయిందన్నారు. 20,217 కుటుంబాలకు గానూ 17,948 ఫ్యామిలీలను సర్వే చేసినట్లు చెప్పారు. మాచాపురంలో అత్యధికంగా 98.68 శాతం, అతి తక్కువగా గురజాలలో 67.55 శాతం సర్వే పూర్తయిందన్నారు. సర్వే 100 శాతం పూర్తి చేసేలా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కృషి చేయాలని సూచించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

కబడ్డీలో బాలికలు సత్తా చాటాలి


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: సంప్రదాయ క్రీడ కబడ్డీలో బాలికలు రాణించడం అభినందనీయమని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో నీలకంఠేశ్వర స్వామి జాతర మహోత్సవం పురస్కరించుకొని స్థానిక ఎంఎస్ బాలికల జెడ్పీ హైస్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్న వైఎస్సార్ అంతర్రాష్ట్ర మహిళా కబడ్డీ పోటీలను బుధవారం రాత్రి మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, పట్టణ సీఐ మధుసూదన్ రాజులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాలికలు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి ఎమ్మిగనూరుకు కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు జట్లు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. వార్డు కౌన్సిలర్ పూజేశ్వరి కబడ్డీ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. పోటీలకు ఢిల్లీ, హర్యానా, తమిళనాడు, కర్ణాటకతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి జట్లు వచ్చాయి. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, పట్టణ ఎస్ఐ రమేష్‌బాబు, కౌన్సిలర్లు ఇషాక్, అమాన్, రంగన్న, కోటకొండ నరసింహులు, విశ్వనాథ్ రమేష్, ఆర్గనైజర్లు రామకృష్ణ, అంజి తదితరులు ఉన్నారు.

5న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

ఆస్పరి: మండలంలోని నగరూరు గ్రామంలో వెలసిన హజరత్ బాబా బడేసాహెబ్ తాత ఉరుసు సందర్భంగా ఈ నెల 5వ తేదీన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు లక్ష్మీనారాయణ బుధవారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ.12 వేలు నగదు అందించనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే జట్లు ఎంట్రీ ఫీజు రూ.800 చెల్లించి ఈ నెల 4వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ 95734 15815, 63008 51615 నంబర్లను సంప్రదించాలన్నారు.

పార్టీ విజయానికి ఐక్యతగా కృషి చేద్దాం


ఆలూరులో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ చిన్న ఈరన్న

ఆలూరు: రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా మరోసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని, పార్టీ శ్రేణులు ఐక్యతతో ముందుకుసాగి సత్తా నిరూపించాలని ఆలూరు మండలం వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ఉమా కల్యాణ మండపంలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు మొలగవెల్లి రామాంజనేయులు సమక్షంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చిన్న ఈరన్న, బీసీ మాదన్న, విరభద్రారెడ్డి, వెంకటరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్వర్లు, వీరేష్, శివయ్య మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలకు వివరించి వారిని చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి శాయశక్తులా కృషి చేయాలన్నారు. త్వరలో ఆలూరు మండలంలోని గ్రామాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు లక్ష్మీనారాయణ, మరకట్టు ఎల్లప్ప, హనుమంతు, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే బీసీలకు ప్రాధాన్యత


మాట్లాడుతున్న బసినె విరూపాక్షి

హొళగుంద: ఎన్నికల సమయంలోనే చంద్రబాబు నాయుడు బీసీ జపం చేస్తారని, ఆ తర్వాత పట్టించుకోడని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీలకు మంత్రి, ఇతర పదవులు ఇచ్చి వారికి తగిన ప్రాధాన్యత ఇచ్చారని కొనియాడారు. బుధవారం హొళగుందలో ఆయన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. తేరు బజారులో ఏర్పాటు చేసిన సమావేశంలో విరూపాక్షి మాట్లాడుతూ.. గతంలో 14 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబు చెప్పుకోవడానికి ఒక్క పథకం కూడా లేదని కల్లబొల్లి మాటలు చెబుతున్న ఇలాంటి నేతను, పచ్చ మీడియాను నమ్మవద్దన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు షఫివుల్లా, మారయ్య, ఈశా, పంపాపతి, దొడ్డబసప్ప, శేషప్ప, జనార్ధన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఖాతాకు జమైన సొమ్ము తిరిగి అప్పగింత

తుగ్గలి: సాంకేతిక కారణాలతో ఇతరుల ఫోన్ ద్వారా తన బ్యాంకు ఖాతాకు జమైన సొమ్మును ఓ మహిళ తిరిగి అప్పగించింది. తుగ్గలికి చెందిన గుత్తి రామాంజినమ్మకు పత్తికొండ ఎస్‌బీఐ శాఖలో ఖాతా ఉంది. ఖాతాకు లింక్ అయిన ఫోన్ నంబర్‌కు గత కొన్ని నెలలుగా సేవలు నిలిచిపోయాయి. తర్వాత అదే నంబర్‌ను కంపెనీ వారు పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన జూటూరు రాంబాబుకు కేటాయించారు. ఆయన ఈ నెల 27న ఫోన్ నంబర్ ద్వారా తన ఖాతాకు ఇతరుల నుంచి రూ.77,500 వేయించుకున్నారు. అయితే ఖాతాలో నగదు జమ కాలేదు. బ్యాంకుకు వెళ్లి ఆరా తీయగా సొమ్ము కర్నూలు జిల్లా పత్తికొండ స్టేట్‌బ్యాంకులోని ఓ ఖాతాకు జమైనట్లు తెలిసింది. రాంబాబు బుధవారం పత్తికొండ ఎస్‌బీఐ అధికారులను కలవడంతో నగదు జమైన ఖాతాదారు అడ్రస్, ఆ గ్రామ వలంటీర్ వివరాలు ఇచ్చారు. వలంటీర్ కల్పన ద్వారా రామాంజినమ్మ ఖాతాలో డబ్బు జమైనట్లు గుర్తించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మోహన్‌రెడ్డి, రాఘవరెడ్డి సాయంతో ఆమెను కలుసుకుని విషయం తెలియజేయగా రామాంజినమ్మ డబ్బును తిరిగిచ్చారు. రెండు ఖాతాలకు ఒకే ఫోన్ నంబర్ లింక్ కావడంతో డబ్బులు రామాంజినమ్మ ఖాతాలో జమైనట్లు తెలిసింది. సొమ్మును తిరిగి ఇచ్చిన రామాంజినమ్మను స్థానిక నాయకులు అభినందించారు.

వాడీవేడిగా మున్సిపల్ సమావేశం


మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ పరిధిలోని వార్డుల్లో పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్‌పై మాజీ ఎమ్మెల్యే తప్పుడు ఆరోపణలు చేయడం శోచనీయమని వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. పట్టణాభివృద్ధిని కాంక్షించే అధికారులపై అనవసర ఆరోపణలు చేయడం తగదన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. విపక్ష కౌన్సిలర్ల వార్డుల్లో సైతం అభివృద్ధి చేస్తున్నా అసంబద్ధ ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. సోమప్ప సర్కిల్‌లో బీటీ రోడ్ల నిర్మాణంపై విపక్ష సభ్యుడు దయాసాగర్ ప్రశ్నించడంపై శిథిలమైనందునే రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని వైస్ చైర్మన్ పేర్కొనడంతో ఈ అంశంపై అధికార, విపక్ష సభ్యుల మధ్య వాదోపవాదాలు జరిగి రసాబాస కావడంతో సభను చైర్మన్ ముగించారు. అంతకుముందు పట్టణంలోని 15వ వార్డులో సోలార్ వాటర్ వర్క్స్ వెనుక భాగంగా మిగిలిన సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1.60 లక్షలు సాధారణ నిధుల నుంచి మంజూరు చేసేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి శివ సర్కిల్ వరకు రోడ్డు డివైడర్ మధ్యలో సెంట్రల్ లైటింగ్ పోల్స్‌కు ఎల్ఈడీ రోప్ ఏర్పాటుకు రూ.5 లక్షలు మంజూరు చేస్తూ కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆదేశాల మేరకు ఇంజినీరింగ్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి నూతన వస్త్రాలు ఇచ్చేందుకు సాధారణ నిధుల నుంచి కేటాయిస్తూ ఆమోదించారు. అదేవిధంగా పలు వార్డుల్లో వేసవిని దృష్టిలో వుంచుకొని కొత్త బోర్లు వేసేందుకు, పాత బోర్లు ఫ్లషింగ్ చేసేందుకు నిధులు కేటాయించారు. పలు వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు పట్టణంలోని సోమప్ప సర్కిల్ నుంచి నలువైపులా బీటీ రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ కౌన్సిల్ సభ్యులు తీర్మానించారు. అజెండాలోని 25 అంశాలతో పాటు టేబుల్ అజెండాలోని రెండు అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతున్నట్లు వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ ప్రకటించారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఈలు మనోహర్ రెడ్డి, నీరజ, విక్టర్, ఆర్ఓ బేబి, మేనేజర్ వరప్రసాద్, టీపీఆర్ఓ గోపాలకృష్ణ, ఏఈలు శరత్‌చంద్ర, మదన్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించుకోండి

చిప్పగిరి: జగనన్న కాలనీలలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ సూచించారు. ఆయన బుధవారం స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ లబ్ధిదారులు స్థానిక గ్రామ సచివాలయానికి వెళ్లి తమ పేరిట ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ ద్వారా స్థలంపై సంపూర్ణ హక్కులు లభిస్తాయని వివరించారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

తుగ్గలి: వైఎస్సార్ పింఛన్ కానుకను గురువారం వేకువజామునుంచే వలంటీర్లు పంపిణీ చేయనున్నారు. మండలవ్యాప్తంగా 7,831 మంది పింఛనుదారులకు ప్రభుత్వం రూ.2,33,57,500 మంజూరుచేసినట్లు ఈఓపీఆర్డీ గోపాల్ తెలిపారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి వలంటీర్లు పింఛన్ సొమ్ము అందజేస్తారన్నారు.

రూ.30 వేలు చోరీ

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ పక్కన బ్యాంక్ ఆఫ్ బరోడా నగదు విత్‌డ్రా పాయింట్‌లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. నిర్వాహకుడు ఎల్లప్ప బుధవారం వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉండటంతో పట్టణ పోలీసులకు సమచారం అందించాడు. పోలీసులు వచ్చి పరిశీలించారు. టేబుల్ లాకర్‌లో ఉంచిన రూ.30 వేలు చోరీకి గురైనట్లు బాధితుడు వాపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

కిరాణా దుకాణం దగ్ధం – రూ.5 లక్షల ఆస్తి నష్టం

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామంలో మంగళవారం రాత్రి రోసమ్మ అనే మహిళకు చెందిన కిరాణ దుకాణం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. దీంతో రూ.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితురాలు వాపోయారు. రోసమ్మ మంగళవారం రాత్రి 8 గంటలకు దుకాణానికి తాళం వేసి తర్వాత ఇంట్లో నిద్రించింది. అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో షాపు నుంచి పొగలు రావడంతో చుట్టు పక్కల వారు గమనించి కేకలు వేశారు. గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా వీలుకాలేదు. ఆదోని నుంచి అగ్నిమాపక కేంద్రం వచ్చేలోపు దుకాణంలోని సరుకులన్నీ కాలి బూడిదయ్యాయి. నగదు రూ.లక్షతో పాటు మొత్తం రూ.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపారు. సర్పంచ్ లింగమ్మ సమాచారం ఇవ్వడంతో వీఆర్ఓ రాజేశ్వరీ ఘటన స్థలాన్ని పరిశీలించి తహసీల్దార్‌కు తెలియజేశారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధితురాలు కోరుతున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎంఎస్ నగర్‌లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి భూమి పూజ చేశారు. వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు. అలాగే పులికనుమ రిజర్వాయర్ ద్వారా ఎల్లెల్సీ నుంచి వస్తున్న నీటిని తాగునీటి అవసరాల కోసం స్థానిక ఎస్ఎస్ ట్యాంకుకు మళ్లింపును కమిషనర్ గంగిరెడ్డితో పాటు డీఈ మనోహర్‌రెడ్డి, ఏఈ శరత్‌చంద్రలు పరిశీలించారు.

అడిగిన వారందరికీ ‘ఉపాధి’

కృష్ణగిరి: ఉపాధి పథకం ద్వారా అడిగిన వారందరికీ పనులు కల్పించాలని ఏపీఓ శేషిరెడ్డి ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టాయని కూలీలకు పనులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈసీ చెన్నకేశవులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సీనియర్ మేటీలు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

హొళగుంద: త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రామాలలో అసాంఘిక కార్యకాలపాలు, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ పెద్దయ్యనాయుడు హెచ్చరించారు. ఆయన బుధవారం హొళగుంద ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు.

హాలహర్వి: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని, ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని ఎస్ఐ నరేంద్ర హెచ్చరించారు. ఆయన బుధవారం మండల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ నాగేంద్ర ఆదోని త్రీటౌన్‌కు బదిలీ అయ్యారు.

ట్యాంక్ నిర్మాణ పనుల పరిశీలన

మద్దికెర: జల్‌జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఇచ్చి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం బొజ్జనాయునిపేట గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులను పరిశీలించారు. వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య


భారతి మృతదేహం

హొళగుంద: హొళగుంద పోలీస్ స్టేషన్ పరిధిలోని నెరణికి గ్రామంలో బుధవారం భారతి (27) వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరికి వేలాడుతూ కనిపించడంతో భర్త రాజశేఖర్ గౌడ్, బంధువులు చికిత్స నిమిత్తం ఆలూరు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు భారతి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. భారతికి ముగ్గురు సంతానం ఉన్నారు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ శ్రీనివాసులు, పోలీసులు ఆలూరు ఆస్పత్రికి వెళ్లి విచారిస్తున్నారు. భారతికి 11 ఏళ్ల క్రితం వివాహమైందని ఆమె మృతికి కారణాలు తెలియరాలేదని ఏఎస్ఐ వెల్లడించారు.